# వెతికే

# కళ్ళకు

# వెలుగు...

( భారతీయ మూలాల ద్వారా వ్యక్తిత్వ వికాసం )


శతావధాని

**ఆముదాల మురళి**



ప్రచురణ

**విజయకృష్ణ విద్యాసంస్థలు**

**తిరుపతి – 517 507**

# వెతికే కళ్ళకు వెలుగు

**( భారతీయ మూలాల ద్వారా వ్యక్తిత్వ వికాసం )**

అవధాన కళానిధి, శతావధాని

**ఆముదాల మురళి**

© హక్కులు రచయితవి

ప్రథమ ముద్రణ

12, అక్టోబరు 2019

(ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు గారి

పుట్టినరోజు సందర్భంగా )

ప్రతులు : 1000

ధర : రూ. 120/-

ప్రతులకు

**ఆముదాల విజయకుమారి**

9-65, యస్.బి.ఐ. కాలని

ఎ.కె.పల్లి (పోస్ట్), రేణిగుంట రోడ్డు

తిరుపతి-517 507

ఫోన్ : 94404 32683

విశాలాంధ్ర అన్నిబ్రాంచీలు

for e-book : www.kinige.com

డి.టి.పి. : చంద్ర, 9849314956

ముద్రణ : సి.యన్. ప్రింటర్స్, తిరుపతి



**శ్రీ యన్. ముక్తేశ్వరరావు** I.A.S. (Rtd.)

సంచాలకులు, శ్వేత

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

---

# ముందుమాట

భర్తృహరి లోకం గురించి ఒక గొప్ప మాట చెప్పాడు. ఆ మాట చెపుతూ లోకం గురించి చాలా వాపోయాడు ఆయన. ఆయన ఏం చెప్పాడంటే! రాజులు చూద్దామా బోల్డంత గర్వం, ఎవ్వరి మాట వినిపించుకోరు, పండితులు చూద్దామా అసూయాగ్రస్తులు, పామరులు చూద్దామా వారికి ఏమీ తెలీదు. కాబట్టి లోకం ఎలా తెల్లవారుతుందిరా నాయనా! అని బాధపడుతూ తన నీతి శతకంలో ఓం ప్రథమంగా చెప్పినటువంటి మాట. ఇది నేను ఎందుకు ప్రస్తావన చేస్తున్నానంటే భర్తృహరి కూడా తను లోకానికి నీతి శతకాన్ని అందిస్తున్నప్పుడు లోకం మీద ఒక పరిపూర్ణమైన ప్రేమ ఒక ఆపేక్షతో దానిని అందించాడు. అందువల్ల ఆయన చెప్పిన మాట ఏమైనట్టు అంటే ఒక ఆప్త వాక్యమైనట్టు. అంటే ఇది నీ మేలు కోరి నీకోసం చెపుతున్నాను అని చెప్పినప్పుడు అది ఆప్తవాక్యమౌతుంది. సరిగ్గా అదే పని మన ఆముదాల మురళి తనదైన శైలిలో చక్కని తెలుగులో చిక్కని భావాలని చాలా చక్కగా అందించడానికి ప్రయత్నం చేశారు ఈ పుస్తకంలో.

వీటిలో విశేషమేమిటంటే భావాలన్నీ కూడా తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, సహజంగా ఒక మంచి ఆలోచనతో, ఒక కూర్పుతో వెళుతూవుంటాయి. అనుకోకుండానే ఏ పదం తీసుకున్నా దాంట్లో చాలా విషయాలు వస్తాయి. ఉదాహరణకు దైవబలం గురించి చెపుతూ దైవబలంలో ఇంద్రుడు అంతటి వాడు అన్నీ సమస్త శక్తులు ఉన్నాసరే ప్రతీ సారి ఓడిపోతుంటాడు ఎందుకంటే దైవబలం లేనందువల్ల అని. దైవబలం ఉన్నప్పుడు ఎటుతిరిగి మన దగ్గరకు వచ్చిపడతాయని ఒక ఎలుక రాత్రంతా పాములబుట్టని కొరికి పాముల బుట్టలోకి వెళ్ళి పామునోటిలో పడింది అని చెప్తారు. అట్లా చాలా విషయాలని మనకి జీవితంలో మన జీవితంలో అనుభవాలను వడబోసినవి సాహిత్యంలోంచి వడబోసినవి మనకు తెలిసినటువంటి అనేక విషయాలను కొత్త రీతిలో పరిచయం

చేస్తుంటారు. ఇది ప్రతి చోట విన్నప్పుడు ఓహో ఈ కోణంలో కూడా దీన్ని మనం ఆలోచించవచ్చే అని మన కనిపిస్తుంది.

మనం దైవ బలాన్ని గురించి కూడా మరీ అంత ఎక్కువ మనం ఆశపడ్డామని చెప్పి దొరికిపోతుంది అనుకోవడం కూడా తప్పు అని చెప్తూ. ఎంత జోరుగా వర్షం కురిసినా సరే చాతకపక్షి నోటిలో పడేది మాత్రం రెండు మూడు చినుకులే. అంటే ఎవరికి ఎంత దక్కాలో అంతే దైవం ఎప్పుడో నిర్ణయించాడు. కాబట్టి మనకు దక్కిన ఫలితాన్ని మనం ఈశ్వర ప్రసాదంగా స్వీకరించాలి అని చెప్పి ఒక మంచి మాట చెప్పారు. అలాగే అన్నింటికీ దైవం కారణమైనా కూడా శ్రమించే వాడి చెమట, ఆలోచించే వాడిలో సృజన, పరిశోధించే వాడిలో మేధస్సు, పనులు చేసేవాడిలో నీతి, నిజాయితీ, పరిపాలించే వాడిలో ధర్మం ఇవన్నీ దైవ స్వరూపాలే దైవాన్ని ఆరాధించటం వల్ల దైవం బలం కలుగుతుంది అంటూ ఈ దైవబలం అన్న అధ్యాయాన్ని ముగించటం చాలా బాగుంది.

అంటే మనిషిని తను పురుష కార్యంగా చేయవలసిన పనిని తాను చేయాలి అని ప్రబోధం చేయటం ఇందులో కనిపిస్తుంది. అంటే నువ్వు చెయ్యవలసినవన్నీ మానేసి కేవలం దైవం బలం అని అనుకోవటమనేది ఎంత అవివేకమో ఇది మనకు గుర్తుచేస్తుంది.

మన సాహిత్యంలో మన సమాజంలో మన నోళ్ళల్లో నానేటటువంటి సామెతల్లో వీటన్నింటిలో కూడా బోల్డంత విజ్ఞానం కాచి వడిపోసి పెద్ద వాళ్లు బహుముఖాలుగా నిలిపారు. ముఖ్యంగా మన ధర్మ స్వరూపాన్ని గురించి గాని మన మన సంప్రదాయాన్ని గురించి గానీ చెప్పినప్పుడు పెద్దలు ప్రచార దృష్టిలో కాకుండా పెద్దవారు ఆచరణ దృష్టిలో చెప్పారు. అంటే ఇది మనం ఆచరించాలి లోకం బాగుండాలి. అని చెప్పారు. వాళ్ళకు కూడా పెద్దవాళ్ళు చెప్పినదే కదా! ఒక రకంగా చెప్పాలంటే ఆప్త వాక్యమే. ఆ శైలిలో ఈ పుస్తకం రావడమనేది ఇది చాలా చక్కగా వుంది. ఈ పుస్తకంలో ఏ పేజీ చదివిని కూడా చాలా బాగుంటుంది.

ఈ మధ్యకాలంలో మనకు వస్తున్నటువంటి సాహిత్యం అంతా కూడా చాలాచోట్ల మనం ఐఐటిలో సీటు ఎలా పొందాలి లేకపోతే, పరీక్షలో ఫలానా



వాటిని ఎలా గుర్తుపెట్టుకోవాలి ఎక్కువ స్కోరు చేయడానికి మనం యేంచేయాలి ఎక్కువ డబ్బులు సంపాదించడానికి ఏమి చేయాలి అని ఇవి మాత్రమే చెప్తున్నారు... దైవం, ధర్మం, స్నేహం ఇలాంటి శాశ్వతమైన విలువలు మనకు వారసత్వ సంపదగా సంక్రమించినవి. వీటిని గురించిన చర్చ ఎక్కడా జరగడంలేదు. ఆ సందర్భంలో చూసినట్లైతే ఇది చాలా పుస్తకాల నుంచి క్రోడీకరించి ఒకచోట చాలా చక్కగా అద్భుతంగా చేసినటువంటి ప్రయత్నంలాగా కనపడుతుంది.

ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మనం నిత్యమూ ఇంట్లో పూజ చేసుకునే టప్పుడు చదువుకుంటున్న ఒకానొక శ్లోకం గుర్తు వస్తుంది. అది ఏమిటంటే గంగేచే యమునేచైవ అని ఆరంభమవుతుంది. అంటే గంగా యమున, గోదావరి నర్మదా, సింధు, కావేరి ఈ నదులన్నీ కూడా వచ్చి ఈ పాత్ర యందు వుందుగాక! అని మనం కోరుకుంటున్నాము. అలాగ అంటే మనకు ముందు వున్నటువంటి కలశ పాత్రలో అన్ని నదుల యొక్క జీవజలాలు ఎలా ఉత్ప్రేక్షిస్తున్నామో, ఎలా ఊహిస్తున్నామో ఎలా సంభావిస్తున్నామో అలాగ మొత్తం ధర్మం యొక్క సంప్రదాయం యొక్క స్వరూపం వాటి విలువలలో ఉన్న మొత్తం స్వరూపం ఇక్కడికి ఒకచోటికి తేవడానికి ఆయన చేసినటువంటి ప్రయత్నం, అది కూడా చాలా సరళ సుందరమైన తెలుగులో తేవడం చేసిన ప్రయత్నం చాలా చక్కగా ఉంది, ఎంతైనా అభినందనీయం అనిపిస్తుంది.

తరువాత ఇంకో విశేషమేమిటంటే మనకి మొత్తం మన పౌరాణిక, ఐతిహాసిక సాహిత్యం చూసినట్లైతే మనకి రెండు రకాలుగా లోకంలోకి వస్తువులు వచ్చినట్లుగా కనబడుతాయి. ఒకటి అవతరించటం అంటే సాక్షాత్తుగా భగవానుడే అనేక రూపాలలో అవతరించడం జరుగుతుంటుంది. రెండవది ఏమిటంటే లోకంలోకి వస్తువులు రావడం, మనము అనేకరకాలుగా మధించి, శోధించి, సాధించి నటువంటి రూపం ఇంకోటి కనబడుతుంది. ఉదాహరణకు పాలసముద్రం నుంచి వస్తువులు అంతకు ముందులోకంలో కనపడనివి సముద్ర మథనం జరిగినప్పుడు ఒక్కొక్క వస్తువు వెలువడినట్లు, దాంట్లో సర్వమంగళ కారకమైనటువంటి లక్ష్మీదేవితో మొదలుకొని ఐరావతం, ఉచ్చైశ్రవం మొదలయినవన్నీ వెలువడ్డాయని చెప్తారు. అలా వస్తువులు ఆవిర్భవించటం ఇంకో భాగం. అవతరించటం ఒకటైతే

ఆవిర్భవించటం ఒకటి. ఇప్పుడు ధర్మస్వరూపం మనదేశంలో అవతరించిన దానికన్నా ఆవిర్భవించింది. అందుకని వివేకానంద స్వామి, సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి మహనీయులందరూ కూడా మన ధర్మస్వరూపాన్ని గురించి చెప్పేటప్పుడు ఏం చెప్తారంటే Hinduisum is a religion which evolved over ages అని ఎన్నో యుగాలపాటు అనేక సన్నివేశాలని, అనేక దైవికమైన, మానుషమైన సంఘటలన్నింటిని కూడా కలుపుకొని మన ధర్మం యొక్క పద్ధతి వచ్చింది అందుకనే ఎప్పుడైనా చెప్పవలసి వచ్చినప్పుడు ఇది నేను కనిపెట్టి చెప్పింది కాదురా బాబు! ఇది లోకానికి పెద్దల నుంచి వచ్చింది అని చెప్పటం కోసం, ఇది అనేక రోజులనుంచి వచ్చింది. పెద్దల నుంచి వచ్చింది. **"ఏష ధర్మ సనాతనః"** అని తరచూ పెద్దలు చెప్తూ ఉంటారు. అలా మన సనాతన ధర్మంలో ఉన్నటువంటి మంచి విషయాలు అన్నిటినీ కూడా ఒక్కచోటకి తెచ్చి మనకి చక్కగా దీనిని అందించినటువంటి మురళి గారు చాలా విశేషంగా ప్రశంసార్హమైన పని చేశారని నేను భావిస్తున్నాను.

ఇంకొక్క మాట కూడా చెప్పాల్సిన అవసరం ఉంది. ఇన్ని చక్కని ఆలోచనలతో ఇంత రమణీయంగా వచ్చినటువంటి ఈ పుస్తకంలో కొన్ని బొమ్మలని కూడా చేర్చి ఉండినట్లైతే చాలా బాగుండేది అనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ కూడా మనలను ఆలోచింప చేసేటటువంటి ధార్మిక సాహిత్యంలో ఈ పుస్తకం ఒకమంచి మైలురాయిగా ఉండిపోతుంది. ముఖ్యంగా ఆముదాల మురళీగారు అనేక ప్రతికూల పరిస్థితులలో కూడా తాను స్వయంగా ఎదురొడ్డి నిలబడి తన స్వయం ప్రకాశంతో ఒక్కొక్క అడుగు కూడ దీసుకుని ముందుకు నడుస్తున్న వ్యక్తిత్వం ఉన్నవారు. వారి రచనలు కూడా అలాంటి శక్తి సామర్థ్యాలే ప్రతిబింబిస్తున్నాయి. వారికి శ్రీపద్మావతీ సమేత శ్రీనివాస స్వామి సమస్త శుభాలను కలుగచేయాలని చెప్పి ఇలాంటి ధార్మిక దీక్ష మరింత కొనసాగాలని నేను కోరుకుంటున్నాను.

ధన్యవాదాలతో,

**యన్. ముక్తేశ్వరరావు,** IAS., (Rtd)



# ముందుగా ఒకమాట...!

శరీరానికి పోషణ అవసరం. పోషణకోసం ఏదో ఒకపని చేస్తూ ఉండాలి. శరీరాన్ని పోషించుకోవడం మాత్రమే నాగరికత కాదు. దానికి మరికొన్ని విలువలు జోడించాలి. జోడించాలంటే ఎవరో ఒకరు బోధించాలి. అలా ధర్మబోధ చేసేవాణ్ణి సమాజం పోషించాలి. లేదంటే బోధకుడు పొట్టకూటి సంపాదనలో మునిగి పోతాడు. సమాజానికి దిశానిర్దేశం కరువౌతుంది. అనాగరిక, ఆటవిక నీతులు రాజ్యమేలుతాయి. ఒకప్పుడు ధర్మప్రచారకులను పోషించే సామాజిక వ్యవస్థ ఉండేది. దానికిప్పుడు కాలదోషం పట్టింది.

నిర్వచనాలు మారుతున్నాయి. సామూహిక విలువలు ధ్వంసమై వ్యక్తిగత విలువలకు ప్రాధాన్యత ఏర్పడుతున్నది. మోసాన్ని తెలివిగా, మంచితనాన్ని చేతగాని తనంగా నిర్వచించే కుసంస్కారం ప్రబలుతున్నది. స్నేహం, ప్రేమ, బంధం.... ఇలా అన్నీ కలుషితమౌతున్నాయి. అనాది నుండి భారతీయ ధార్మిక వ్యవస్థ అందించిన విలువల పట్ల గౌరవంలేని పిదప బుద్ధులు గల జాతి వృద్ధి చెందుతున్నది. పాతవాటిలో దోషం ఉండొచ్చు, దాన్ని దిద్దుకోవాలి. క్రొత్తదాంట్లో మంచి ఉండొచ్చు, దాన్ని స్వీకరించాలి.

'సూక్తి ముక్తావళి' కార్యక్రమం ద్వారా ఆకాశవాణి విలువలను పరిరక్షించే పనికి పూనుకొన్నది. నాకు కూడా అవకాశం కల్పించింది. ఆ సందర్భంగా ఆకాశవాణిలో వివిధ అంశాలమీద చేసిన ప్రసంగాలివి. సమాజ శ్రేయస్సును, వ్యక్తిత్వ వికాసాన్ని, భారతీయమైన విలువలను, కలగలిపి, ప్రాచీన సాహిత్య కారుల అభిప్రాయాలను, పద్యాలను శ్లోకాలను గుర్తుచేస్తూ వ్రాసిన వ్యాసాలివి. గాల్లో కలిసిపోకుండా, మరింత మందికి నా భావాలను చేరవేయడానికి పుస్తకంగా తీసుకొని వస్తున్నాను.

ఆకాశవాణి (కడప, తిరుపతి) వారికి ముందుమాటతో ఆశీర్వదించిన శ్రీముక్తేశ్వర రావుగారికి, డి.టి.పి. చేసిన చంద్ర గారికి, ముద్రణ చేసిన సి.ఎన్. ప్రింటర్స్ వారికి, ముద్రణ ధన సహాయ మొనర్చిన **తి.తి.దే.** వారికి కృతజ్ఞతలు.

**ఆముదాల మురళి**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సజ్జన సాంగత్యం | 9 |
| 2. | ప్రకృతి స్నేహం | 12 |
| 3. | కుటుంబ సౌఖ్యం | 15 |
| 4. | సంపదలు | 18 |
| 5. | గెలుపు | 21 |
| 6. | దైవబలం | 24 |
| 7. | స్నేహం | 27 |
| 8. | ఉత్తమ పురుషుడు | 30 |
| 9. | దురహంకార నిరాసన | 33 |
| 10. | సానుకూల దృక్పథం | 36 |
| 11. | అనుకూల శత్రువు | 39 |
| 12. | అన్నం పరబ్రహ్మం | 42 |
| 13. | కర్తవ్యం – జీవన సాఫల్యం | 45 |
| 14. | అనర్థదాయిని – అహంకారం | 47 |
| 15. | ప్రియభాషణం | 49 |
| 16. | తృప్తి | 51 |
| 17. | శ్రమైక జీవన సౌందర్యం | 54 |
| 18. | అభ్యాసయోగం | 57 |
| 19. | దృష్టిమారాలి | 60 |
| 20. | దివ్యజీవితం – దీర్ఘజీవితం | 63 |
| 21. | క్షమాగుణం | 66 |
| 22. | ధర్మో రక్షతి రక్షితః | 69 |
| 23. | క్రమశిక్షణ | 72 |
| 24. | ధైర్యగుణం | 75 |
| 25. | పరోపకారం | 78 |
| 26. | దేశభక్తి | 81 |
| 27. | పవిత్రవ్రతాలు | 84 |
| 28. | ఎంపిక | 87 |
| 29. | ఆందోళన చెందరాదు | 90 |
| 30. | సమయజ్ఞత | 93 |
| 31. | జ్ఞానజీవనం | 96 |
| 32. | వారసత్వసంపద | 99 |
| 33. | ఆతిథ్యం | 102 |
| 34. | మనోనియంత్రణ | 105 |
| 35. | సంపాదన | 108 |




# సజ్జన సాంగత్యం

మంచివారితో చేసే స్నేహాన్ని 'సజ్జన సాంగత్యం' అంటారు. సజ్జనులంటే వ్యక్తిగత అభిమానంతో వ్యక్తులు చేసే తప్పులను కూడా సమర్థించేవారు కాదు. సత్యాన్ని సత్యంగా గ్రహించి, నిష్కర్షగా వ్యవహరించే వారే సజ్జనులు. అటువంటివారి చెలిమితోనే వ్యక్తిత్వం వికసిస్తుంది. దుర్యోధనుడు కూడా అన్ని శాస్త్రాలు అభ్యసించాడు. కానీ అతనితో ఉన్న శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు పొరబాటున దుర్యోధనుడు చేసిన తప్పులను కూడా సమర్థించడంతో దుర్యోధనుడు తాను చేసినదంతా ధర్మబద్ధమనుకొన్నాడు. దాంతో కౌరవవంశమే నాశనమై పోయింది. వ్యక్తికి హితాన్ని చేకూర్చే మాటలు చెప్పేవారు సజ్జనులౌతారు. దానికి వ్యక్తిగత ఇష్టాయిష్టాల ప్రమేయం ఉండదు, ఉండకూడదు.

సత్యము నిత్యమైనది, నాశనం లేనిది. దానిని తెలిసిన వారే "సజ్జనులు". ఈ భూతభౌతికప్రపంచం పరిణామశీలమైనది. ఏది పరిణామానికి లోనవుతుందో అది నశిస్తుంది. మరి నశించేది సత్యం ఎలా అవుతుంది?

మూడు కాలాల్లో (కాలానికి) కర్తగా, మూడు అవస్థల్లో సాక్షిగా ఉండే చైతన్య స్వరూపుడైన శ్రీవేంకటేశ్వర పరబ్రహ్మమే నిత్యం ఆయనే సత్యం. ఆయనను తెలుసుకొన్నవారు, నమ్మినవారు, భజన చేసేవారు, సంకీర్తన చేసేవారు, పూజలు, వ్రతాల ద్వారా కొలుచువారు, సేవజేసేవారు అందరూ సజ్జనులే.

ఎవరి హృదయం భగవంతునికి ఆలయమౌతుందో అతడు సజ్జనుడు. అతడు తనతోటి ప్రాణులందు కూడా భగవంతుని దర్శించగలుగుతాడు. హరి విశ్వమయుడని, విశ్వం హరిమయమని తెలుసుకుంటాడు.

అటువంటి సజ్జనులతో స్నేహం సాధకులకు, ఇహ,పర ఫల సాధకంగా ఉపయోగపడుతుంది. విధివశమున ఒకే తల్లి పిల్లలైన రెండు చిలుకలు విడిపోయాయి. ఒకటి ఒక దేవాలయ ప్రాంగణంలోని అర్చకస్వామి ఇల్లు చేరింది. మరొకటి ఒక వ్యాపారస్తునికి దొరికింది. మెల్లమెల్లగా రెండు చిలుకలూ మాటలు నేర్చుకుంటున్నాయి. దేవాలయంలోని చిలుక 'గోవింద! గోవింద!' అని పలుకుతూ ఉంటే రెండో చిలుక 'నాణ్యమైన సరుకు, సరసమైన ధర' అంటూ ఉండేది.

వ్యక్తుల సాంగత్యాన్ని అనుసరించే ఆలోచనలు, ప్రవర్తన ఆధారపడి ఉంటాయి. సజ్జన సాంగత్యం నుంచి ఫలితాన్నిస్తే, దుర్జన సాంగత్యం చెడు ప్రభావాన్ని చూపుతుంది.

కొంతమంది సాధువులకు సేవచేస్తూ ఒక స్త్రీ ఉండేది. ఆవిడకు ఒక పిల్లవాడు ఉండేవాడు. అతను కూడా తల్లితోపాటు ఆ సాధువులకు తనచేతనైన సేవచేసేవాడు. వారు చెప్పే హరికథలు వినేవాడు. వారు చేసే శ్రీహరి భజనల్లో పాల్గొనేవాడు. పూజకు కావాల్సిన సామాగ్రి, యజ్ఞానికి కావాల్సిన సమిధలు సమకూర్చేవాడు. వారితో పాటు ఆ పిల్లవాడు కూడా నిరంతరం హరినామస్మరణ చేస్తూ పులకరించి పోయేవాడు. ఆ మహానుభావులు చేసే తాత్త్విక చర్చలలోని సత్యాన్ని మెల్లమెల్లగా అర్థం చేసుకోవడం ప్రారంభించాడు. శరీరాలన్నీ అశాశ్వతాలని, హరియొక్కడే సత్యమని తెలుసుకొన్నాడు.

అతని తల్లి మరణించింది. ప్రకృతి ధర్మాన్ని అర్థం చేసుకొన్నాడు. ఆ ప్రకృతికి అధిష్ఠాన దైవమైన నారాయణుని పొందాలనుకొని అవిచ్ఛిన్న తైలధారవలే హరినామం జపించసాగాడు. అప్పటివరకు ఉన్న సేవకవృత్తిని కూడా విడిచిపెట్టాడు. సత్సంగం నుంచి నిస్సంగాన్ని, నిర్మోహాన్ని, నిశ్చల తత్త్వాన్ని పొంది చివరకు తన పాంచభౌతిక శరీరాన్ని కూడా త్యజించాడు.


ఆ హరి నామస్మరణ వలన, హరిదాసులకు దాసుడై సేవచేసినందు వలన మరుసటి జన్మలో అతడు బ్రహ్మ మానస పుత్రుడై జన్మించాడు. అతడే నారదుడు. సజ్జన సాంగత్యం జన్మజన్మల సౌభాగ్యాన్ని కలుగజేస్తుందనడానికి పరమ భాగవతోత్తముడైన నారదుడే ప్రసిద్ధ దృష్టాంతంగా ఉన్నాడు.



**కం॥ చెలిమియె కీడు నొసంగును**
**చెలిమియె సద్గుణముఁగూర్చుఁజింతింపంగా**
**చెలిమియె కీర్త్యపకీర్తులఁ**
**గలిగించుం గానఁదెలిసి కలియుము చెలులన్**

కీడు, మేలు – సద్గుణం, దుర్గుణం – కీర్తి, అపకీర్తి ఇలా వేటికైనా చెలిమియే ప్రధాన కారణం. అందుకే భాగవతంలో భక్తుడు, భగవంతుని వద్ద "నీపాదకమల సేవయు నీ పాదార్చకుల తోడి నెయ్యము" ప్రసాదించమని కోరుకున్నాడు. భగవంతుని సేవలో తరించెడి సజ్జనుల సేవ, స్నేహం భగవంతుని సమీపమునకు తీసుకొని వెళ్తుంది. నవవిధ భక్తిమార్గములలో సఖ్య భక్తి కూడా ప్రధానమైనది. కుచేలుడు మొదలైనవారు ఆ మార్గంలోనే తరించారు. కనీసం హరిభక్తులతోనైనా సఖ్యం చేయడమే ముక్తిపథ సోపానం కాగలదు. తనకు దగ్గర కావాలనుకొనే వారికి అత్యంత సమీపంలో ఉండే శ్రీవేంకటపతి, ముముక్షువులకు నిరంతరం అండగా ఉంటాడు.

శ్రీ వేంకటనాథుని అండదండలు పొందే సులభమార్గం ఈ సజ్జన సాంగత్యమే. ఇది ఇహపరాలకు పిత్రార్జితంలా తోడుండి కాపాడుతుంది.



# ప్రకృతి స్నేహం

మానవుడు ప్రకృతిలో అంతర్భాగం. భూమి, నీరు, నిప్పు, గాలి మొదలగునవన్నీ మానవుని జీవనానికి అత్యంత ఆవశ్యకాలు. వీటిలో ఏవొక్కటి లేకపోయినా జీవించడం అసాధ్యం. అంతేకాదు. అసలు జీవి పుట్టుకే వాటివల్ల కలుగుతుంది. అందుకే మనిషి విజ్ఞానవంతుడయ్యేకొద్దీ తన అభ్యుదయానికి కారణమైన ప్రకృతినే దైవంగా భావించాడు. మనకు భూమి దేవత, నీరు దేవత, నిప్పు దేవుడు, వాయువు కూడా భగవంతుడే. భారతదేశం యొక్క సంస్కృతి ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉంది. మానవుడు ప్రకృతితో మమేకమైపోయి జీవించడం అలవాటు చేసుకొన్నాడు. తాను ప్రకృతికి ఋణపడి ఉన్నానని భావించాడు, ఋణం తీర్చుకోవడం కోసం పూజలు చేశాడు, యజ్ఞాలు చేశాడు. చెట్లు నాటించాడు, చెఱువులు, కుంటలు త్రవ్వించాడు. నీటిని నిలువచేసి పంటలు పండించాడు. తన ఆకలితోపాటు ఎన్నో జీవుల ఆకలిని తీర్చాడు.

ఉన్నదాన్ని, తాను సంపాదించుకొన్నదాన్ని లేదా తాను పండించు కొన్నదాన్ని తనను ఆశ్రయించిన పదిమందికి పంచి తినే మానవుడు మెల్లగా దాచుకోవడం అలవాటు చేసుకొన్నాడు. దాచుకొనే అలవాటు మనిషికి మొదటి నుంచీ ఉన్నదే, కాని వర్షాకాలం కోసం కొంత దాచుకొనేవాడు. రాను రాను మూడు నెలల వర్షాకాలం నుంచి వచ్చే ఏడాదికోసమని, ముసలితనం కోసమని, బిడ్డల కోసమని, మనవళ్ళ కోసమని, నాలుగోతరం కోసమని ఇలా దాచిపెట్టుకొనే పరిమాణం పెరుగుతూనే ఉంది. అలా పెరుగుతున్న స్వార్థానికి మొదట మనిషికి ఆశ్రయం ఇచ్చిన ప్రకృతే బలైపోతున్నది.



మానవుడు కలప కోసమని, బొగ్గుకోసమని, వంటచెఱకుకోసమని రకరకాల కారణాలతో చెట్లను నరికివేస్తున్నాడు. గతంలో ఇలాంటి అవసరాలకు చెట్లు నరకాల్సిన వచ్చినప్పుడు చెట్టు బదులు చెట్టు నాటే ఆచారం ఉండేది. చెట్టునుంచి చిన్నకొమ్మను విరుచుకోవాలన్నా చెట్టుకు నమస్కారం చేసి విరుచుకోవాలని పెద్దలు ప్రబోధించారు.

**"ఇల పక్షుల కాశ్రయమై**
**ఫలియించెడి తరువు నఱుకు పాపాత్ములు సం**
**కెలలబడి ఘోర నరకా**
**గ్నుల గూలరె యముని భటులు కొఱవులఁ జూడన్"** అని

పద్మ పురాణంలో చెప్పబడింది. పక్షుల కాశ్రయమిచ్చి, ఫలించే చెట్లను నరికే పాపాత్ములకు నరకం తప్పదని పురాణం హెచ్చరించింది. జనాభా పెరుగుదలవల్ల మానవుల అవసరాలు పెరిగినమాట వాస్తవమే. అందుకని ప్రకృతిని విధ్వంసం చేయడం మాత్రం అనుచితం. చెరువులు, కుంటలు నగరీకరణలో మాయమైపోతున్నాయి. నదులు, వంకలు, వాగులు మనిషి దురాశకు కనుమరుగైపోతున్నాయి. దీనివల్ల మనిషి క్రమంగా ప్రకృతికి దూరమైపోతున్నాడు. అభివృద్ధి అవసరమే, కాని మానవమనుగడను ప్రశ్నార్థకంలో పడవేసే అభివృద్ధి వల్ల అసలుకే మోసం వస్తుంది. పారిశ్రామికీకరణ పట్ల ఉన్న శ్రద్ధ వాటి నుంచే వెలువడే వ్యర్థాలవల్ల భూమి, నీరు, గాలి పాడైపోకుండా చూచుకోవడంలోనూ ఉండాల్సిందే.

ఒక కాలంలో వర్షం రానప్పుడు కాలువ లోతట్టునో, చెరువునో ఆక్రమించు కొంటే వర్షం కురిసినప్పుడు ఆ నీరు ఏ మార్గం గుండా వెళ్ళాలి. ఎక్కడ నిలువ ఉండాలి? మనిషి స్వార్థాన్ని విడిచి ప్రకృతితో స్నేహం చేయాలి. చెరువును ప్రేమించాలి. భూమిని ప్రేమించాలి, గాలిని ప్రేమించాలి, చెట్లను ఆరాధించాలి. పచ్చగా ఉన్న చెట్లతో నిండిన నేలమాత్రమే మానవునికి నివాసయోగ్యమైనది. ఆరోగ్యదాయకమైనది. మనిషి తాను పొందుతున్న ప్రతి సుఖానికి మూలకారణమైన పదార్థాలను ప్రకృతి నుండే పొందుతున్నాడు. విత్తనం ఉంటే మనిషి పండించగలడు.

ప్రకృతి సాయం లేకుండా విత్తనాన్ని చెట్టు చేయగలడా? మనిషి పుట్టుకకు ఎదుగుదలకు ప్రకృతే మూలకారణం. ప్రకృతిని మనిషి తన స్వార్థంతో మూర్ఖత్వంతో ధ్వంసం చేస్తే అదే ప్రళయ కారణమౌతుంది.

తప్పు చేస్తున్న వాళ్ళు, అడ్డుకొనే అధికారం ఉండి ఏవో ప్రయోజనాలకు ఏవో ప్రలోభాలకు లొంగి తప్పుని ఆపనివాళ్ళు ఇద్దరూ ప్రకృతి ద్రోహులే. అంతేకాదు 'చెరపకురా చెడేవు' అన్న సామెత ఉండనే ఉంది. ఇంకా గండిశ్రీ రామకృష్ణానందస్వామి "గోడకట్టేవాడు పైకిపోతాడు, బావి త్రవ్వేవాడు క్రిందికి పోతాడ"ని పదే పదే అన్నమాటలు మనిషి గుర్తుచేసుకోవాలి. ప్రకృతిని ధ్వంసం చేయడం దేశద్రోహం కన్నా తీవ్రమైనది. భవిష్యత్తరాలను అంధకారంలో ముంచే చర్యలకు విజ్ఞులు స్వస్తి చెప్పాలి.

ఇల్లు కట్టుకొనేటప్పుడు ఒక్కోపనికి ఒక్కో ప్రత్యేకగదిని కేటాయించుకొన్నట్లే ప్రతిఇంట్లో చెట్లు నాటుకోవడానికి స్థలం వదలి చెట్లను పెంచాలి. ప్రకృతి ప్రమాదంలో ఉందంటే మానవజాతి ప్రమాదంలో ఉన్నట్లే. మనుషులంతా ప్రకృతి అనే ఓడలో ప్రయాణిస్తున్న యాత్రికులు, పడవ మునిగితే అందరూ మునిగిపోతారు. దీనికి పరిష్కారం ఒకటే, ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో స్నేహం చేయడం. ప్రకృతి అవసరాలను మనిషి గుర్తించడం. తనలోని స్వార్థాన్ని తగ్గించుకోవడం. అప్పుడే ప్రకృతి మనిషిని చల్లగా చూస్తుంది. లోకమంతా సుఖంగా ఉంటుంది.





# కుటుంబసౌఖ్యం

వ్యక్తి చుట్టూ వలయాలు వలయాలుగా సమాజం అల్లుకొని ఉంటుంది. వాటిలో ప్రథమ వలయం కుటుంబం. తల్లిదండ్రులు, భార్య భర్త, పిల్లలు కలిసి జీవించడం కుటుంబం. సభ్యుల సంఖ్యలో తేడా ఉంటుంది కాని వ్యవస్థలో అంతా సారూప్యతే ఉంటుంది. సమాజం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకొనే వ్యక్తులు మొదట వారివారి కుటుంబాలకు ఆరోగ్యం, ఆనందం అందాలని ఆలోచించాలి. ఎందుకంటే సమాజమంటే కుటుంబాల సముదాయమే కదా!

కుటుంబపోషణ నిమిత్తం ప్రతిఒక్కరు వ్యవసాయమో, ఉద్యోగమో, వ్యాపారమో చేయాల్సిందే. తద్వారా ధనం లభిస్తుంది. ఈ ధనసంపాదనలో పడి మనిషి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను విస్మరించకూడదు. కుటుంబ సభ్యులకు యజమాని సంపాదన ఎంత అవసరమో ప్రేమానురాగాలు కూడా అంతే అవసరం. కుటుంబ సభ్యులు తమ ఆనందాన్నో దుఃఖాన్నో యజమానితో హాయిగా పంచుకోగలిగే వాతావరణం, చనువు ఉండాలి. యజమాని అంటే కుటుంబాన్ని అజమాయిషీ చేసేవాడు కాదు, కుటుంబ సభ్యులను సమన్వయ పరిచేవాడుగా ఉండాలి.

కలిసి జీవించేటప్పుడు అందరి అభిప్రాయాలు ఒకేలా ఉండాలనే నియమం లేదు. కాని ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకోవాలి. అలా గౌరవించక పోతే కుటుంబసభ్యుల మధ్య పొరపొచ్చాలు చోటు చేసుకొంటాయి. ఇలాంటి సందర్భాల్లో యజమాని సంయమనంతో వ్యవహరించి సభ్యుల మధ్య సమన్వయం సాధించాలి. అపార్థాలు చేసుకోవడానికి గల కారణాలను విశ్లేషించి వివరించాలి.

ఈ మొత్తం వ్యవహారమంతా ప్రేమపూర్వకంగానే జరగాలి. పొరబాటు చేసిన కుటుంబసభ్యులను క్షమించగలగాలి. ఆ పొరబాటు వల్ల ఉత్తరోత్తరా జరిగే నష్టాన్ని వివరించి మళ్ళీ ఆ పొరబాటు చేయనీకుండా జాగ్రత్తపడాలి.

సమాజంలో చాలామంది అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ, నేరాలకు పాల్పడుతూ ఉన్నారు. అటువంటి వారిలో చాలామంది అలా కావడానికి వారికి కుటుంబప్రేమ అందకపోవడమే కారణం. కుటుంబమంటే నలుగురైదుగురు మరమనుషులతో కలిసి ఉండడం కాదు. ఒకరి కాలికి ముల్లు గుచ్చుకుంటే మరొకరి కంట్లో నీరు కారాలి. ఒకరు గెలిస్తే మరొకరి ముఖం వికసించాలి. పడ్డవాణ్ణి పైకి లేపేందుకు, నడకరాని వాణ్ణి నడిపించేందుకు నిరంతరం సిద్ధంగా ఉండే ఒక ప్రేమపూరితమైన వ్యవస్థే కుటుంబం.

పశువులు మేతకోసం ఎంతదూరం వెళ్ళినా సాయంకాలానికి వాటికి దూడలు గుర్తుకు రాగానే వెనుదిరిగి పరుగుపరుగున వస్తాయి. ప్రతివ్యక్తి తనకుటుంబసభ్యులతో గడపడానికి సమయం కేటాయించాలి. కారణాలేవో చూపి ఎక్కువసమయం కుటుంబానికి దూరంగా ఉండకూడదు. పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ ఎంతో అవసరం. అలాగే వృద్ధులకు బిడ్డలప్రేమ అవసరం. పిల్లల్ని ఎదిగే వయసులో తల్లిదండ్రులు దూరంగా ఉంచకూడదు. వారిని వీలైనంతకాలం దగ్గరే ఉంచుకోవాలి. బిడ్డలు తల్లిదండ్రులనుంచి ఎన్నో విలువలు నేర్చుకోవాలి. సమాజాన్ని పిల్లలు సరైన దృక్పథంలో అర్థం చేసుకోవడానికి తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి.

చాలామంది తల్లిదండ్రులు తమబిడ్డలకు కావలసిన వస్తువులు కొనిచ్చాము. ఇంక వారికే కొరత లేదని అనుకొంటూ ఉంటారు. వృద్ధులైన తమ తల్లిదండ్రుల పట్ల, లేదా అత్తమామల పట్ల కూడా వీరికి అదే భావన ఉంటుంది. కాని పిల్లలైనా పెద్దలైనా వస్తువుల కంటే కూడా ప్రేమగా పలుకరించే మాటలకు ఎక్కువ సంతోషిస్తారని గుర్తుంచుకోవాలి. ఇంట్లో ఉన్న పిల్లల్నైనా, పెద్దల్నైనా అనురాగంతో పలుకరించడమే వారికి తృప్తినిస్తుంది. కుటుంబాన్ని ప్రేమించ లేనివాడు సమాజాన్ని ప్రేమించలేడు. అలాంటివారు నిరంతరం దుఃఖంతో నలిగిపోతూ ఉంటారు.



యుక్తవయసులో అడుగుపెడుతున్న కుటుంబసభ్యులున్న కుటుంబ యజమాని వారితో ఎక్కువ సమయం గడపాలి. వీలైనంతవరకు ఇంట్లో సభ్యులంతా దినానికొకపూటైనా కలిసి భోంచేయాలి. కుటుంబానికి సంబంధించిన రాబడి గురించి, ఖర్చుల గురించి అందరూ కలిసి చర్చించు కోవడం వల్ల వాస్తవ పరిస్థితులు తన కుటుంబీకులకు తెలుస్తుంది. తద్వారా వారికి బాధ్యతలు తెలిసివస్తాయి. దుబారా ఖర్చులు తగ్గిపోతాయి.

కుటుంబ ఆనందాన్ని ధ్వంసం చేసే ప్రధాన విషయం అనారోగ్యం. కుటుంబీకులందరి ఆరోగ్య విషయాలు అందరికీ తెలిసి ఉండాలి. భార్యా పిల్లలకు ఏమందు పడుతుందో ఏది పడదో కూడా తెలియని వ్యక్తులు ఉండటం మంచిది కాదు. నీటి కంటే రక్తం చిక్కనైనదని ఆంగ్లంలో ఒక సామెతుంది. రక్త సంబంధం ఉన్న కుటుంబం యొక్క యోగక్షేమాలు కోరుకోవడం వ్యక్తుల సామాన్య కర్తవ్యం. కుటుంబీకులంతా ఆనందంగా ఉన్నప్పుడే యజమాని ఆనందంగా ఉండగలుగుతాడు. ఆనందంగా ఉన్న వ్యక్తి తన కర్తవ్యాన్ని సమర్ధంగా, సమగ్రంగా నిర్వహించగలడు. పనిలో అలిసిపోయిన వ్యక్తికైనా, జీవనపోరాటంలో అలసి పోయిన వ్యక్తికైనా అలసటదీర్చి, సాంత్వన చేకూర్చేది కుటుంబమే. మానవుని ఆశల సౌధానికి కుటుంబమే పునాది.

కుటుంబం విధ్వంసమైతే సమాజం విచ్ఛిన్నమౌతుంది. సహనమైనా, అసహనమైనా కుటుంబంలో పుడుతుంది. కుటుంబ మూలాలను రక్షించుకొంటే సమాజంలో శాంతి సహనాలు వెల్లివిరుస్తాయి. ప్రేమను పంచేవారికే ప్రేమను కోరే హక్కు ఉంటుంది. పంచడం కుటుంబంతో మొదలైతే లోకం ప్రేమమయ మౌతుంది.

# సంపదలు

మానవుడు నిరంతరం ఏదో ఒక పని చేస్తూ ఉండటం తాను తన కుటుంబం ఆనందంగా ఉండడానికే. ఆనందంగా ఉండాలంటే కోరికలు తీరాలి. కోరికలు తీరాలంటే సంపదలు కలగాలి. అందుకే మానవుని ప్రయత్నాలన్నీ సంపదలవైపే ఉంటాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో చేసే పనులు సంపదల సృష్టికి కారణ మౌతాయి. సంపదలను సృష్టించడంలో ఒక్కోసారి మానవుడు కోరుకున్న విధంగా జరుగకపోవచ్చు. మరోసారి అనుకొన్న దానికంటే ఎక్కువ ఫలితం చేకూరవచ్చు. ఇలా జరగడం వెనుక ఉన్న కారణాలను మనిషి విశ్లేషించు కోవాలి.

సంపదలు వచ్చేటప్పుడు కొబ్బరికాయలోకి నీరు చేరినట్లు చేరుతాయని, పోయేటప్పుడు ఏనుగు మ్రింగిన వెలగపండులా తెలియకుండానే నశించిపోతాయని సుమతీ శతకంలో చెప్పబడింది. ఈ విషయంలో పురుషప్రయత్నం ఉండాల్సిన అవసరం లేదని భావించరాదు. విదురనీతిలో ఇలా చెప్పబడింది.

**"అర్థ సిద్ధిం పరామిచ్ఛన్ ధర్మమేవాదితశ్చరేత్ ।**
**నహి ధర్మాదపైత్యర్థః స్వర్గలోకాదివామృతమ్ ॥" (5-48)**

అనగా బాగా ధనాన్ని కోరుకొనేవారు మొదటినుండి ధర్మమునందే ప్రవర్తించాలి. ఎందుకంటే స్వర్గాన్ని వదలి అమృతం పోని విధంగా ఎప్పటికీ ధనం ధర్మాన్ని వదలి వెళ్ళదు అని అర్థం. ఎవరు నిరంతరం ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటారో వారికి సంపదలు సమకూరుతాయి. ధర్మబద్ధంగా పనులు చేస్తున్నప్పుడు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దీన్ని గూర్చి భారవి, కిరాతార్జునీయంలో



**"సహసా విదధీత నక్రియామవివేకః పరమాపదాం పదమ్ ।**
**వృణుతే హి విమృశ్యకారిణం గుణలుబ్ధాః స్వయమేవ సంపదః ॥"** అన్నారు.

చేసే పనులను తొందరపడి చేయకూడదు. అన్ని ఆపదలకూ అవివేకమే కారణమౌతుంది. సంపదలెప్పుడూ గుణవంతుల పక్షాననే ఉంటాయి ఆలోచించి పనిచేసే వాళ్ళను సంపదలు స్వయంగా వరిస్తాయి.

సంపదలు లౌకిక సంపదలని, పారలౌకిక సంపదలని రెండు రకాలుగా ఉంటాయి. ధనకనక వస్తువాహనాదులు లౌకిక సంపదలు. పుణ్యం, కీర్తి, జ్ఞానం పారలౌకిక సంపదలు. పారలౌకిక సంపదలకు భౌతిక రూపం ఉండదు. అందువల్ల అవి నశించవు. మిగిలిన సంపదలన్నీ కాలక్రమంలో నశించిపోతాయి. కావున మానవుడు లౌకిక జీవనం కోసం సంపాదించుకొనే సంపదలతోపాటు శాశ్వతంగా ఉండే పారలౌకిక సంపదల్ని కూడా సముపార్జించుకోవాలి. నశించిపోయే సంపదల్ని కూడబెట్టుకొన్నవాణ్ణి దుఃఖం నీడలా వెంటాడుతూ ఉంటుంది. తన కళ్ళెదుటే పరులపాలై పోయే సంపదలకన్నా తన తర్వాత కూడా శాశ్వతంగా ఉండే సంపదల్ని, తనను చిరంజీవిని చేసే సంపదల్ని కూడ బెట్టుకోవడమే తెలివైన వాని పని. మూర్ఖుడు మేఘం నీడ వంటి భౌతిక సంపదలే శాశ్వతమనే భ్రమలో ఉంటాడు. ఆ ధనమదంతో జ్ఞానులను కూడా హింసిస్తాడు. పుణ్యము, కీర్తి రాకపోగా పాపాన్ని, అపకీర్తిని మూటగట్టుకొంటాడు.

శూరులు, విద్యావంతులు, సేవచేయడం తెలిసినవారు ఈ భూమి మీద బంగారు పువ్వులు కోయగలరని రామాయణం చెబుతుంది. అంటే విద్యావంతులు కానివారు, సేవచేయడంరాని అవిధేయులు లేదా సోమరులు ఎప్పటికి సంపదలు పొందలేరు. సంపద అంటే శ్రమను ధనంగా మార్చడమే. ధైర్యం, శారీరక ఆరోగ్యం, దేహదారుఢ్యం కూడా సంపదలే. పిరికివాడు ఏ నిర్ణయము తీసుకోలేడు. రోగి సంపదను వ్యయింపచేస్తాడే కాని సృష్టించలేడు. అందుకే ఆరోగ్యానికి మించిన సంపద ఈ లోకంలో ఏదీ ఉండదు.

ఉన్నత విద్యావంతులు, సంస్కారవంతులైన పిల్లల్ని కలిగి ఉండటం కూడా సంపదే. వీటన్నిటిని పరిగణనలోకి తీసుకొని ఒక వ్యక్తి సంపదను లెక్కించాలి.